హంటర్ ఫిష్ 'ఆన్ డ్యూటీ'

- డెంగ్యూ, మలేరియా నివారణపై జీవీఎంసీ ప్రత్యేక దృష్టి
- దోమల వ్యాప్తి నివారణకు రంగంలోకి గంబూసియా చేపలు
- తొలి విడతగా నీటికుంటల్లో పెంపకానికి 2.5 లక్షల చేపలు



విడుదలకు సిద్ధం చేసిన ఫిష్‌లు



వీఎంఆర్‌డీఏ పార్కు బోట్ క్లబ్ నుంచి నిల్వ ఉంచిన చేపలు తీస్తున్న సిబ్బంది (ఇన్‌సెట్) గుంబూసియా ఫిష్

ఎంవీపీ కాలనీ: సీజనల్ వ్యాధులైన డెంగ్యూ, మలేరియాల నివారణపై జీవీఎంసీ ప్రత్యేక దృష్టి సారించింది. వర్షాకాలం ప్రారంభం కావడంతో సీజనల్ వ్యాధుల ముప్పు పొంచి ఉండటంతో సరికొత్త యాక్షన్ ప్లాన్ రూపొందించింది. దోమల వ్యాప్తిని అడ్డుకునే హంటర్ ఫిష్ గుంబూసియాను (దోమ చేప) రంగంలోకి దించింది. ప్రస్తుతం వీటిని నగరంలో అన్ని జోన్ల పరిధిలోని ఫౌంటైన్‌లు, నీటి కుంటలు, కాలువల్లో పెంచే చర్యలకు శ్రీకారం చుట్టింది. వీటి పెంపకం ద్వారా దోమల పెరుగుదలను అడ్డుకుని, డెంగ్యూ, మలేరియాకు చెక్ పెట్టేలా కార్యచరణ ప్రారంభించింది.

2.5 లక్షల గుంబూసియా చేపలు సిద్ధం

దోమల నివారణలో 6 మిల్లీమీటర్ల పొడవు ఉండే గుంబూసియా ప్రత్యేక పాత్ర పోషిస్తోంది. వీటికి దోమల లార్వాను ఆహారంగా స్వీకరించే సహజ గుణం ఉంది. ఇవి రోజుకు 100 లార్వాలను, గుడ్లను ఆహారంగా తీసుకుంటాయి. వ్యర్థ నీటి కుంటలు, ఫౌంటైన్లలో వీటిని వదలడం ద్వారా దోమ లార్వాను తిని దోమలు వ్యాప్తి చెందకుండా అడ్డుకుంటాయి. తద్వారా జులై నుంచి డిసెంబర్ మధ్య పెరిగే దోమల వ్యాప్తితో పాటు వాటి ద్వారా వచ్చే వ్యాధులకు అడ్డుకట్ట వేయాలని జీవీఎంసీ యోచిస్తోంది. ఇందులో భాగంగా తొలి విడతగా 2.5 లక్షల గుంబూసియా చేప పిల్లలను నగరానికి తీసుకొచ్చారు. ఆయా జోన్‌లకు వీటి కేటాయింపులు చేశారు. జోన్-3 పరిధిలో 40 వేలు చేప పిల్లలను కేటాయించారు. దీంతో జోన్-3 మలేరియా విభాగం, శానిటేషన్ విభాగం సిబ్బంది వార్డుల వారీగా గుర్తించిన ఫౌంటైన్‌లు, నీటి కుంటల్లో వీటిని విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం జోన్-3 పరిధిలోని 14, 15, 16, 19, 20 వార్డుల్లోని చాలా ప్రాంతాల్లో వీటి విడుదల ప్రక్రియ పూర్తయింది. ఇప్పటి వరకు 10 వేల నుంచి 15 వేల చేపలను విడుదల చేశారు.



లుంబినీ పార్కులోని ఫౌంటైన్‌లో చేపలను విడిచిపెడుతున్న సిబ్బంది

కమిషనర్ ఆదేశాలతో కార్యాచరణ



దోమల నివారణకు గుంబూసియా చేపలను వినియోగించాలని జీవీఎంసీ కమిషనర్ ఆదేశించడంతో ఈ కార్యాచరణను ప్రారంభించాం. 20 లక్షల చేపలు నగరంలో విడుదల చేయాలని కమిషనర్ ఆదేశించారు. దీంతో తొలివిడతగా పశ్చిమగోదావరి జిల్లా బాదంపూడిలోని ప్రభుత్వ ఫిషరీస్ విభాగం నుంచి తొలివిడతగా 2.5 లక్షల చేపలను తీసుకొచ్చాం. వాటిని వీఎంఆర్‌డీఏ పార్కు బోట్ క్లబ్, సీతమ్మధార కొండపై ఉన్న చెరువులో నిల్వ చేశాం. జోన్‌ల వారీగా పంపిణీ చేస్తున్నారు. జోన్-3 పరిధిలో పలు వార్డుల్లో 15 వేల వరకు చేపలను విడుదల చేశారు. అన్ని చోట్ల నిరంతరాయంగా ఈ ప్రక్రియ జరుగుతోంది. గంబూసియా చేపల వినియోగంతో దోమల పెరుగుదలను అడ్డుకోవాలనే కార్యచరణతో ముందుకు సాగుతున్నాం. – బి.శ్రీనివాస్, జోన్-3 మలేరియా విభాగం ఇన్‌స్పెక్టర్

సాంకేతికతను అందుబాటులోకి తేవాలి

- జాయింట్ కలెక్టర్ విశ్వనాథన్



వ్యవసాయ సలహా మండలి సమావేశంలో మాట్లాడుతున్న జేసీ విశ్వనాథన్, చిత్రంలో చైర్మన్ ప్రసాదరాజు

మహారాణిపేట : జిల్లాలో వ్యవసాయ అనుబంధ రంగాల రైతులకు సాంకేతికత అందుబాటులోకి తీసుకురావాలని జిల్లా జాయింట్ కలెక్టర్ కేఎస్ విశ్వనాథన్ అధికారులను కోరారు. శుక్రవారం సాయంత్రం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన జిల్లాస్థాయి వ్యవసాయ సలహా మండలి సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి విత్తనాలు, ఎరువులు రైతులకు ఆర్బీకేల ద్వారా అందుబాటులో ఉంచాలన్నారు. వరి కొనుగోళ్లలో ఇబ్బందులు తలెత్తకుండా సక్రమ నిర్వహణకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. దీని వల్ల రైతులకు ఎటువంటి నష్టం వాటిల్లకుండా ఉంటుందన్నారు. కౌలు రైతులకు పంట రుణాలు రెన్యువల్ చేసేందుకు తగిన చర్యలు చేపట్టాలని బ్యాంకు అధికారులను కోరారు. ఇటీవల అధిక వర్షాల వల్ల ముంపునకు గురై నష్టం వాటిల్లిన వరినారు సమాచారం ప్రభుత్వానికి నివేదిక పంపించాలన్నారు. జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ డీవీప్రసాద్‌రాజు మాట్లాడుతూ భూసార పరిస్థితులను బట్టి అధిక దిగుబడినిచ్చే పంటలను, పాడి, మత్స్య పరిశ్రమలకు సంబంధించి సూచనలు అందించాలన్నారు. ప్రభుత్వం అందించే రాయితీ రైతులకు ఆర్బీకే కేంద్రాల ద్వారా వర్తించేటట్లు అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అప్పలస్వామి మండల, గ్రామస్థాయిలో చర్చించిన విషయాలు జాయింట్ కలెక్టర్‌కు పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. పశుసంవర్ధక, ఉద్యానవన, పట్టు, ఇతర అనుబంధ శాఖలు, పౌరసరఫరాల అధికారులు చేపడుతున్న అభివృద్ధి పథకాల గురించి వివరించారు. ఈ సమావేశంలో పశుసంవర్ధక శాఖ జేడీ రామకృష్ణ , లీడ్ బ్యాంక్ మేనేజర్ శ్రీనివాస్, పౌరసరఫరాల కార్పొరేషన్ జిల్లా మేనేజర్ రాజేశ్వరి, ఉద్యానవన శాఖ అధికారి మన్మథరావు తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన అవసరం



11వ వార్డులో డ్రైడే కార్యక్రమంలో మాట్లాడుతున్న మేయర్ హరివెంకటకుమారి

ఆరిలోవ: సీజనల్ వ్యాధులపై మలేరియా, పారిశుధ్య విభాగాల అధికారులు ప్రజలకు అవగాహన కల్పించాలని మేయర్ గొలగాని హరి వెంకటకుమారి సూచించారు. జీవీఎంసీ 11 వార్డులో శుక్రవారం మలేరియా విభాగం ఆధ్వర్యంలో ఫ్రైడే డ్రైడే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ మొదట స్థానిక బావిలో గంబూసియా చేపలను వదిలారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రతి శుక్రవారం తప్పనిసరిగా డ్రైడే పాటించాలన్నారు. దోమల నియంత్రణకు మలేరియా సిబ్బంది ఫాగింగ్ చేయాలని ఆదేశించారు. ప్రజలు కూడా ఇంట్లోని ఫ్రిజ్‌ల వెనుక భాగంలో నీరు నిల్వ లేకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకుడు గొలగాని శ్రీనివాస్, మలేరియా, శానిటరీ విభాగాల సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

కండ్ల కలకపై అప్రమత్తంగా ఉండాలి

ఆరిలోవ: కండ్ల కలకపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆస్పత్రి వైద్య నిపుణుడు డాక్టర్ మురళీధర రామప్ప శుక్రవారం తెలిపారు. వర్షాకాలంలో బ్యాక్టీరియా ఇన్‌ఫెక్షన్స్ ద్వారా కండ్ల కలకలు వస్తాయని, ఇది ప్రమాదకరం కాదన్నారు. అంటువ్యాధి కావడంతో దీనిపై జాగ్రత్తగా ఉండాలని ఆయన సూచించారు. కండ్ల కలక బాధితులు ఇతరులకు సోకకుండా జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. బాధితులు వైద్యులను సంప్రదించి తగిన మందులు వాడితే త్వరగానే తగ్గిపోతుందన్నారు.

రహదారి విస్తరణ పనులు ప్రారంభం



రహదారి పక్కన షెడ్లను తొలగిస్తున్న సిబ్బంది

ఏయూ క్యాంపస్: స్థానిక 20వ వార్డులోని ప్రభుత్వ మానసిక ఆస్పత్రి నుంచి పోలమాంబ ఆలయానికి వెళ్లే మార్గాన్ని విస్తరిస్తున్నారు. దీనిలో భాగంగా రోడ్డు పక్కన రహదారి నిర్మాణానికి అడ్డంగా ఉన్న పలు షెడ్లను తొలగించారు. రహదారిని భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా విస్తరిస్తున్నారు.

వెంకయ్య అప్పలస్వామికి ఏయూ డాక్టరేట్

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం కంప్యూటర్ సైన్స్(సీఎస్) ఇంజినీరింగ్ విభాగ పరిశోధక విద్యార్థి డాక్టర్ బూర్లె వెంకయ్య అప్పలస్వామికి వర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. ఈ సందర్భంగా ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి నుంచి ఆయన డాక్టరేట్ ఉత్తర్వులు స్వీకరించారు. శాస్త్రవేత్త డాక్టర్ సురేష్ బాత, ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డిల సంయుక్త పర్యవేక్షణలో 'డీప్ లెర్నింగ్ విధానాలను ఉపయోగించి డయాబెటిక్ రెటినోపతి పైన విస్తృతమైన పరిశోధనకు ఈ డాక్టరేట్ లభించింది. ఈ సందర్భంగా వెంకయ్య అప్పలస్వామిని పలువురు అభినందించారు.

ఘనంగా ప్రపంచ ప్రకృతి సంరక్షణ దినోత్సవం



కృష్ణా కళాశాలలో ప్రకృతి సంరక్షణపై ప్లకార్డులు ప్రదర్శిస్తున్న విద్యార్థులు

మద్దిలపాలెం: డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రపంచ ప్రకృతి సంరక్షణ దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కళాశాల వృక్ష శాస్త్ర విభాగం విద్యార్థుల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.విజయబాబు మాట్లాడుతూ ప్రకృతిని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. అనంతరం విద్యార్థులు ప్రకృతిని కాపాడుకోవడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్లకార్డులు ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో వృక్ష శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ బి.చంద్రమౌళి, అధ్యాపకులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీవారికి పంచామృతాభిషేకం



సర్టిఫికెట్లు అందుకున్న సాంస్కృతిక ప్రదర్శనలిచ్చిన విద్యార్థులు

ఎంవీపీ కాలనీ: విశాఖ సాగరతీర శ్రీవారి కార్తీక దీపోత్సవ కమిటీ, వైదిక విజ్ఞాన విపంచి సంస్థల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీవారి శ్రావణ మాసోత్సవ సప్తాహం కార్యక్రమాలు శుక్రవారం కొనసాగాయి. ఇందులో భాగంగా శుక్రవారం ఉదయం వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య శ్రీవేంకటేశ్వరస్వామికి పంచామృతాభిషేకం వైభవంగా నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా విద్యార్థులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా నిర్వాహకులు వారికి సర్టిఫికెట్లు, బహుమతులు ప్రదానం చేశారు.

పోలమాంబ ఆలయ పునర్నిర్మాణానికి ప్రణాళిక



ఆలయాన్ని పరిశీలిస్తున్న అధికారులు

ఏయూ క్యాంపస్: స్థానిక పోలమాంబ ఆలయంలోని గర్భాలయం, మండపం పునర్నిర్మాణానికి సంబంధించిన ప్రణాళిక సిద్ధమైంది. దాదాపు రూ.2 కోట్ల వ్యయంతో ఈ ఆలయాన్ని పునర్నిర్మాణం చేపట్టనున్నారు. ఇప్పటికే ఆలయ పాలక మండలి, కార్యనిర్వహణాధికారి నుంచి ప్రతిపాదన పంపారు. దీనిని పరిశీలించిన దేవదాయ శాఖ అధికారుల బృందం, స్థపతి ఆలయాన్ని శుక్రవారం సందర్శించారు. ప్రధానంగా ఇరుకుగా ఉన్న గర్భాలయాన్ని పెద్దదిగా నిర్మించడం, కారిపోతున్న ముఖ మండపాన్ని మార్పు చేయడం, తదితర పనులు చేయనున్నారు. ఈ కార్యక్రమంలో కార్యనిర్వహణాధికారి సురేష్‌బాబా, ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ పి.శంకరరెడ్డి, మండలి సభ్యులు పాల్గొన్నారు.

40 కేజీల గంజాయి స్వాధీనం

ఎంవీపీకాలనీ: మన్యం నుంచి పశ్చిమ బెంగాల్‌కు గంజాయి రవాణా చేస్తున్న ముగ్గురిని ద్వారకా పోలీసులు శుక్రవారం అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి సుమారు 40 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్స్ పోలీసులకు వచ్చిన విశ్వసనీయ సమాచారం మేరకు దాడులు చేయగా.. ద్వారకా పోలీసు స్టేషన్ పరిధిలో వారు పట్టుబడ్డారు. దర్యాప్తు అనంతరం పూర్తి వివరాలు వెల్లడిస్తామని ద్వారకా పోలీసులు తెలిపారు.

21వ వార్డులో 'గడప గడపకు మన ప్రభుత్వం'



ప్రజలకు పథకాల గురించి వివరిస్తున్న అక్కరమాని విజయనిర్మల

బీచ్ రోడ్డు: జీవీఎంసీ 21వ వార్డు కోటక్ స్కూల్ ప్రాంతంలో శుక్రవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త అక్కరమాని విజయనిర్మల ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాల కోసం వివరించారు. పార్టీలకు అతీతంగా అర్హుల అందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మాత్రమేనన్నారు. మహిళల ఆర్థిక స్వావలంబన కోసం ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రసాదుల భాగ్యానంద్, మధుపాడ రవికుమార్, కోన జయలక్ష్మి, తదితరులు పాల్గొన్నన్నారు.

దోమల నివారణకు ఫాగింగ్



ఫాగింగ్ చేస్తున్న జీవీఎంసీ సిబ్బంది

ఏయూ క్యాంపస్: దోమల నివారణకు జీవీఎంసీ సిబ్బంది శుక్రవారం సాయంత్రం స్థానిక 20వ వార్డు పెదవాల్తేరులోని పలు వీధుల్లో ఫాగింగ్ నిర్వహించారు. జీవీఎంసీ సిబ్బంది వీధుల్లో తిరుగుతూ దోమల నివారణ మందు పిచికారీ చేశారు.

ఆహార వ్యర్థాల నుంచి కంపోస్ట్ తయారీ



రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

కొమ్మాది: వృథాగా పారవేసే ఆహార పదార్థాల నుంచి కంపోస్ట్ తయారు చేసి పంటల దిగుబడి ఏ విధంగా పెంచవచ్చో తెలియజేస్తూ గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం పర్యావరణ శాస్త్ర విభాగం చేపట్టిన ప్రాజెక్టు సత్ఫలితాలను ఇస్తోందని ప్రాజెక్టు ప్రధాన నిర్వహణ అధికారి డాక్టర్ ఎస్.శ్రీనివాస్ తెలిపారు. భారత ప్రభుత్వ శాస్త్ర సాంకేతిక విభాగం మంజూరు చేసిన ప్రాజెక్ట్ సైన్స్ ఫర్ ఈక్విటీ ఎంపవర్‌మెంట్ అండ్ డెవలప్‌మెంట్‌లో భాగంగా ఉత్తరాంధ్ర జిల్లాలోని రైతులకు శుక్రవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. వ్యర్థంగా వదిలివేసే ఆహారంలో ఉన్న పోషక విలువలు గుర్తించి, వాటిని చిన్న గుళికలుగా మార్చి వాటిని వ్యవసాయ రంగంలో రైతులు వాడటం వలన పంట దిగుబడులు పెరుగుతున్నట్లు తాము గుర్తించామని తెలిపారు. దీనికోసం ప్రత్యేకంగా గీతం ప్రాంగణంలో కంపోస్ట్ తయారీ కేంద్రం నెలకొల్పి, ప్రయోగాత్మకంగా 250 మంది రైతులకు అందించామని తెలియజేశారు.

జాబ్ మేళాకు విశేష స్పందన

కంచరపాలెం: స్థానిక జిల్లా ఉపాధి కార్యాలయంలోని నేషనల్ కెరీర్ సర్వీస్ సెంటర్‌లో ఆంధ్రప్రదేశ్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్కిల్స్ డెవలప్‌మెంట్ అండ్ ట్రెనింగ్ ఆధ్వర్యంలో శుక్రవారం మెగా జాబ్ మేళా నిర్వహించారు. దీనికి విశేష స్పందన లభించినట్లు జిల్లా ఎంప్లాయ్‌మెంట్ అధికారి సిహెచ్.సుబ్బిరెడ్డి(క్లరికల్) తెలిపారు. లలితా జ్యూవెల్లరీ మార్ట్, కల్యాణ్ జ్యూవెల్లర్స్, డెక్కన్ ఫైన్ కెమికల్స్, స్పందన స్ఫూర్తి, ఫైనాన్సియల్, హానర్ ల్యాబ్స్, హెటిరో డ్రగ్స్, యాక్సిస్ బ్యాంక్, టీమ్ లీజ్, ఎస్‌బీఐ అండ్ ముత్తూట్ హౌసింగ్ ఫైనాన్స్, పలు ప్రైవేటు లిమిటెడ్ కంపెనీల్లో 535 ఉద్యోగాల భర్తీకి నిర్వహించిన ఇంటర్వ్యూల్లో 415 మంది అభ్యర్థులు హాజరు కాగా.. 161 మంది ఎంపికైనట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు. వారి సర్టిఫికెట్లను పరిశీలించి, అభ్యర్థులకు సుబ్బిరెడ్డి చేతుల మీదుగా నియామక పత్రాలు అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం పలు ప్రైవేటు కంపెనీలను ప్రోత్సహించడంతో వాటిల్లో నేరుగా నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పిస్తోందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఎ.సంగీత, ఆయా సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రతి వ్యక్తి సేవాభావం అలవరచుకోవాలి



లిటిల్ హగ్స్ అనాథాశ్రమాన్ని ప్రారంభిస్తున్న చైతన్యానంద చిన్నస్వామి

తగరపువలస : ప్రతి వ్యక్తి తన సంపాదనలో కొంత భాగాన్ని సేవా కార్యక్రమాలకు వినియోగించాలని విజయనగరం జిల్లా నెల్లిమర్ల దుర్గాశ్రమానికి చెందిన శ్రవణ చైతన్యానంద చిన్నస్వామి కోరారు. శుక్రవారం భీమిలి మండలం గొల్లల తాళ్లవలసలో భరోసా లవ్ ఫర్ హ్యూమానిటీ సంస్థ వ్యవస్థాపక చైర్మన్ అట్టాడ అవినాష్ ఆధ్వర్యంలో లిటిల్ హగ్స్ అనాథాశ్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పేదరికం లేని సమాజాన్ని నిర్మించడానికి ప్రతి ఒక్కరు సేవాభావం అలవరచుకోవాలన్నారు. ఎస్పీ నవీన్‌కుమార్ మాట్లాడుతూ తల్లిదండ్రులు, ఆత్మీయుల ప్రేమాభిమానాలు కోల్పోయిన నిరాశ్రయులైన చిన్నారులను ఆదుకోవాలనే ఆలోచన అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఫ్రెష్ ఛాయిస్ ఈఈవో నరసింహారావు, మణికంఠ స్వీట్స్ అధినేత ఆదిమూలం నాగరాజు, టోష్టం అధినేత నరేష్, జాతీయ మానవ హక్కుల కమిషన్ చైర్మన్ నాగేశ్వరరావు, వెంపాడ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు వెంపాడ శ్రీనివాసరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు అక్కరమాని అప్పలనాయుడు, చిల్ల హరి, ఎంపీటీసీ సభ్యుడు కోరాడ రమణ, టీం భరోసా కార్యదర్శి బల్లా శ్రీనివాస్, లిటిల్ హగ్స్ సభ్యులు వెంపాడ పద్మావతి, కమల, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ గుర్తు తెలియని వ్యక్తి మృతి



మృతుడు

పీఎం పాలెం : గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటనపై పీఎం పాలెం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదయింది. ఇందుకు సంబంధించి స్థానిక సీఐ వై.రామకృష్ణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. వైఎస్సార్ క్రికెట్ స్టేడియం ఎదురుగా ఉన్న రోడ్డులో అపస్మారక స్థితిలో యువకుడు శుక్రవారం ఉదయం కనిపించడంతో స్థానికులు 108 వాహనంలో కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మరణించాడు. సాయంత్రం ఆ వ్యక్తి మరణించినట్టు ఆసుపత్రి వర్గాలు పోలీస్ స్టేషన్‌కు తెలిపాయి. మృతుని వివరాలు తెలియ రాలేదని, గుర్తు తెలియని వ్యక్తి మృతి కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

ఎండాడలో రాములోరి పాదుకలు



కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డు ఎండాడ స్కైలైన్ అపార్ట్‌మెంట్స్ ప్రాంగణంలోని విజయగణపతి ఆలయంలో శుక్రవారం అయోధ్య శ్రీ రాముని పాదుకలకు ప్రత్యేక పూజలు చేశారు. అయోధ్యలో శ్రీరాముని పాదుకలు ప్రతిష్ఠించనున్న నేపథ్యంలో దేశవ్యాప్తంగా ఉన్న ఆలయాల్లో పూజలు నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. అందులో భాగంగా ఏర్పాటు చేసిన పూజల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6.30 గంటల వరకు భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు.

ప్రకృతి వనరుల పరిరక్షణ అందరి బాధ్యత



మొక్కలు నాటుతున్న ప్రిన్సిపాల్, విద్యార్థులు

ఎంవీపీ కాలనీ: స్థానిక వీఎంసీ డిగ్రీ కళాశాలలో ప్రకృతి వనరుల పరిరక్షణ దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం, గ్రీన్ క్లైమేట్ టీం సంయుక్తంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో భాగంగా ప్రిన్సిపాల్ జగదీశ్వరరావు సమక్షంలో విద్యార్థులు, అధ్యాపకులు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ప్రకృతి వనరులను కాపాడాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. అడవులు, జీవావరణాలను పరిరక్షించినప్పుడే మానవ మనుగడ సజావుగా సాగుతుందన్నారు. ఆరోగ్యకరమైన జీవనం ప్రకృతి పరిరక్షణతోనే సాధ్యమవుతుందన్నారు. గ్రీన్ క్లైమేట్ వ్యవస్థాపక కార్యదర్శి జేవీ రత్నం మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో యువత ఎక్కువగా భాగస్వాములు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఎన్ఎస్ఎస్ పీవో అప్పారావు, పలువురు అధ్యాపకులు పాల్గొన్నారు.

పర్యావరణానికి విఘాతం మానవాళికి నష్టం



పర్యావరణ చైతన్య కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఆచార్య రాజగణపతి

ఏయూ క్యాంపస్: పర్యావరణానికి విఘాతం కలిగిస్తే మానవాళికి నష్టం తప్పదని గాయత్రి విద్యా పరిషత్ సంయుక్త కార్యదర్శి ఆచార్య పి.రాజగణపతి అన్నారు. శుక్రవారం బీచ్‌రోడ్డులోని గాయత్రి విద్యా పరిషత్ ఎంఎల్‌బీటీ పాఠశాలలో ఇష్రే సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విరివిగా మొక్కలు నాటి సంరక్షించాలని సూచించారు. ఇష్రే సంస్థ సభ్యుడు పి.మధు మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా పర్యావరణ సమతుల్యతను కాపాడటానికి కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ కె.మధురవాణి, డి.గిరిధర్, వెంకటకృష్ణ, డి.వి.ఎస్.ఎస్.పద్మ, సంస్థ అధ్యక్షుడు యు.సి.ఎం.పట్నాయక్ పాల్గొన్నారు.

ఏయూ సమాచారం..

విద్యార్థుల్లో పర్యావరణ చైతన్యానికి కృషి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: విద్యార్థుల్లో పర్యావరణ చైతన్యం పెంపునకు కృషి చేయాలని ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి కోరారు. శుక్రవారం తన కార్యాలయంలో వరల్డ్ నేచర్ కన్జర్వేషన్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ భవిష్యత్ ఉపాధ్యాయులుగా మారే బీఈడీ, ఎంఈడీ విద్యార్థుల్లో పర్యావరణ స్పృహ, చైతన్యం విస్తృతంగా కల్పించాల్సిన అవసరం ఉందని సూచించారు. తద్వారా వారు రానున్న తరాలకు మార్గ నిర్దేశం చేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్‌సీటీఈ కమిటీ సభ్యుడు ఆచార్య జి.రమేష్, అంబేడ్కర్ విశ్వవిద్యాలయం వీసీ ఆచార్య నిమ్మ వెంకటరావు, ఏయూ విద్యా విభాగాధిపతి ఆచార్య టి.షారోన్‌రాజు, డాక్టర్ నాగరాజ కుమారి పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి క్షీరాభిషేకం

దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు జరిగిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. పై పూజలో పాల్గొనదలిచే భక్తులు 0891-2566514, 2711725 నంబర్లలో సంప్రదించవచ్చని ఆలయ ఈవో కె.శిరీష తెలిపారు. కార్యక్రమంలో ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ఏఈవో కె.తిరుమలేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు. ఈ ప్రత్యేక పూజ ప్రతి శుక్రవారం నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో కె. శిరీష తెలిపారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.500 చెల్లించిన యెడల పూజకు దంపతులను లేదా ఇద్దరిని అనుమతించనున్నట్టు చెప్పారు.

శ్రీవారికి పట్టు వస్త్రాల సమర్పణ



కొమ్మాది: రుషికొండలోని శ్రీ మహాలక్ష్మి సహిత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం వారాంతపు పూజలు వైభవంగా నిర్వహించారు. ముందుగా శ్రీవారి ప్రత్యేక అలంకరణకు వస్త్రాలను, అభిషేక సామాగ్రిని మంగళవాయిద్యాల నడుమ తీసుకువెళ్లి సమర్పించారు. అభిషేకాల అనంతరం స్వామి ని అలంకరించి, భక్తులకు దర్శనం కల్పించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు, వేద పండితులు పాల్గొన్నారు.